క్లుప్తంగా

సాగుపై దృశ్య పాఠాలు



వనపర్తి రూరల్: మండలంలోని నాగవరం శివారులోని రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నానో యూరియా, డీఏపీ, పండ్లతోటలో విలువ ఆధారిత ఉత్పత్తులు, పశుగ్రాసంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీ మహిత, ఏఓ కురుమయ్య, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శ్రీకృష్ణుడి విగ్రహం బహూకరణ



కొత్తకోట: పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయానికి దేవరకద్ర నియోజవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్ని రకాల సహాయ సహకారాలు అందించారని కమిటీ సభ్యులు తెలిపారు. అందులో భాగంగా కొద్ది రోజుల్లోనే హైటెన్షన్ కరెంట్ స్తంభాలను సవరించి, అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డుకు సీసీ వేయించిన జీఎమ్మార్‌కు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. దీంతో కమిటీ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని శాలువాతో సత్కరించి, శ్రీకృష్ణ పరమాత్ముడి విగ్రహాన్ని బహూకరించారు.

దరఖాస్తులు అందజేయాలి

వీపనగండ్ల: మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 200 యూనిట్ల కరెంటు, సబ్సిడీ సిలిండర్ల పథకంలో అర్హత పొందని వారు బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి తమ వివరాలు తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శి రమేశ్‌రెడ్డి కోరారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కరెంటు బిల్లు, గ్యాస్‌బుక్కుతో పాటు ప్రజాపాలన రశీదును కూడా తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నేడు తైబజార్ వేలం

మదనాపురం: మండల కేంద్రంలో నిర్వహించే సంతకు సంబంధించి తైబజార్ వేలాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి విష్ణు తెలిపారు. వేలం పరిమితి ఏడాది వరకు ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.1.5లక్షలు గ్రామపంచాయతీ మదనాపురం పేరు మీద ఎస్‌బీఐలో డీడీ తీసి, గ్రామ పంచాయతీలో అందించాలని సూచించారు.

'పుర' కార్మికులకు వేతనాలు ఇవ్వాలి



వనపర్తి రూరల్: ఉగాది పండుగ సమీపిస్తుండంతో మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి మంగళవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ స్పందించి వేతనాలు చెల్లించడానికి ప్రయత్నం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, గడ్డం కురుమయ్య, మౌలాలి, గోపాల్ పాల్గొన్నారు.

'అధిక చార్జీలు వసూలు చేయొద్దు'

పెద్దకొత్తపల్లి: మీ సేవ కేంద్రాలలో ప్రజల నుంచి అధిక చార్జీలు వసులు చేస్తే మీసేవ కేంద్రాలపై చర్యలు తప్పవని తహసీల్దార్ జేకే మోహన్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో మీసేవ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్ నాయక్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం అందించాలి

కొల్లాపూర్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుతూ బీజేపీ నాయకులు ఆర్డీఓ భన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆయనను కలిశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అర్హులకు రేషన్ కార్డులు అందించాలని, రాజీవ్ యువ వికాసం స్కీమ్‌ను దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరికీ అందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కాడం శ్రీనివాస్, నాయకులు ధనుంజయ్‌గౌడ్, శ్రీలక్ష్మి, కాశీపురం మహేష్, శ్రీరామ్‌యాదవ్, భాస్కర్, పరమేష్, కల్పనా రెడ్డి, భాస్కర్‌గౌడ్, రమేష్, రాజుయాదవ్, భరత్ తదితరులు ఉన్నారు.

బాధిత రైతులను ఆదుకుంటాం

- వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం
- నష్టపోయిన రైతులందరికీ పరిహారం
- కలెక్టర్ ఆదర్శ్ సురభి



సంకిరెడ్డిపల్లి శివారులో నేలకొరిగిన వరి పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

కొత్తకోట రూరల్: ఇటీవల కురిసిన అకాల వర్షం, వడగండ్ల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ ఆదర్శ్‌సురభి తెలిపారు. మంగళవారం మండలంలోని సంకిరెడ్డిపల్లిలో అకాల వర్షం కారణంగా నష్టపోయిన వరి పంటలను కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందునాయక్‌తో కలిసి పరిశీలించారు. వెంకట్‌రాములు అనే రైతు సాగు చేసిన వరి పంటను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. సంకిరెడ్డిపల్లిలో 170 ఎకరాల్లో పంట నష్టపోయిందని అధికారులు తెలిపారు.

మోడల్ ఇందిరమ్మ ఇంటి సందర్శన

కొత్తకోట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను కలెక్టర్ సందర్శించారు. మిగితా అన్ని మండలాల్లో కూడా ఇంటి నిర్మాణం ప్రారంభించి, పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పర్వతాలు, డీఈ విఠోబా, ఉద్యానశాఖ అధికారి అక్బర్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి

వనపర్తి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులుతో కలిసి వైద్య అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో గర్భిణుల పేర్ల నమోదు పెంచాలని సూచించారు. ఆశా వర్కర్లతో నిరంతరం రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి, అవసరమైన సూచనలు చేయాలన్నారు. అదే విధంగా శిశువుల్లో వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో 30 ఏళ్ల పైబడిన వారికి నిర్వహిస్తున్న మిషన్ మధుమేహ (డయాబెటిక్ పరీక్షలు) కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ఎంత మేర పూర్తయిందని కలెక్టర్ ఆరా తీశారు. ఇప్పటివరకు 90 శాతం పరీక్షలు పూర్తి చేయగా.. 2,114 కొత్త డయాబెటిస్ కేసులు నిర్ధారణ అయినట్లు ఎన్సీడీ అధికారి సమాధానం ఇచ్చారు. మార్చి 31 లోపు మిషన్ మధుమేహ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేసి, డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఓపీడీ నమోదు సమయంలోనే అబా కార్డుల జనరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. వంద రోజుల క్షయ సర్వే కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి కుటుంబ సంక్షేమ శాఖ తరపున అవార్డు దక్కించుకున్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. సమావేశంలో వైద్యశాఖ అధికారులు డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ రామచంద్ర, జీజీహెచ్ సూపరింటెండెంట్ రంగారావు, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్షయ నిర్ధారణ పరీక్షలు



అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పాన్‌గల్: క్షయ నిర్మూలనకు 100 రోజుల కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ అనుమానితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షల చేస్తున్నారని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. మంగళవారం మండలంలోని శాగాపూర్‌లో క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ నిర్మూలన కోసం కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశానుసారం గ్రామానికే అంబులెన్స్‌లో మొబైల్ ఎక్స్‌రే, తెమడ పరీక్షలు చేసే యంత్రాలు తీసుకొచ్చి అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారు క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ క్రింద పౌష్టికాహారం తీసుకోవడానికి నెలకు రూ.1000 అందజేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కోఆర్డినేటర్ ఖాజా, ఎక్స్‌రే టెక్నీషియన్ సురేందర్, వైద్య సిబ్బంది రాంచంద్రయ్య, సతీష్‌కుమార్, సుమిత్ర, ప్రవీణ్‌కుమార్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు సరికాదు



నాచహల్లి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

వనపర్తి రూరల్: కరెంట్ కోతలు ఎత్తివేసి నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసి పంటలను కాపాడాలని బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం మండలంలోని నాచహల్లి సబ్‌స్టేషన్ వద్ద పెద్దగూడెంతండా, సవాయిగూడెం రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఏడీ, ఏఈలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాణిక్యం మాట్లాడుతూ కొంతకాలంగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడి పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు కంకి పట్టే స్థితిలో ఉన్నాయని, కరెంటు కోతల వల్ల నీరందక ఎండిపోతున్నాయని వాపోయారు. గతంలో సాయంత్రం 6 గంటల నుంచి సరఫరా ఉండేదని, అది నిలిపివేసి మధ్యరాత్రి నుంచి త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. మధ్యరాత్రి సమయాలల్లో రైతులు పంట పొలాలకు వెళ్తే విషసర్పాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ డేగ మహేశ్వర్‌రెడ్డి, రైతు సమితి అధ్యక్షుడు నరసింహ, టీక్యానాయక్, కొండన్న, ధర్మనాయక్, చిట్యాల రాము, కృష్ణనాయక్, మనోహర్, మాధవరెడ్డి, నరేష్, శంకర్‌నాయక్, నారాయణనాయక్, వెంకటయ్య, అంజి, శేఖర్, శివరామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

వనపర్తి రూరల్: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇచ్చి పంటలను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాల్వలు, బోర్ల కింద రైతులు యాసంగిలో వరిసాగు చేయగా.. జిల్లాలో పలుచోట్ల లోవోల్టేజీ కారణంగా బోర్లకింద పంటలకు నీరందక ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు ఎండితే తప్పని పరిస్థితిలో రైతుల పక్షాన రాస్తారోకో చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కొత్తకోట మండలంలోని సంకిరెడ్డిపల్లి 170 ఎకరాల్లో పంట దెబ్బతిందని, రైతులు స్వయంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారన్నారు. జిల్లా కేంద్రంలో ఈనెల 23న జరిగిన సీపీఐ శత జయంతి విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ్, రమేష్, మోష, గోపాలకృష్ణ, ఎర్ర కురుమయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీ'లు అమలు చేయాలి



గాంధీనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

వనపర్తి రూరల్: కాంగ్రెస్ ఎన్నికల ముందు పేదలకు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు మంగళవారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీ 18 వార్డులో ఇంటింటి సర్వే చేసి, ప్రజలతో కాలనీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డులో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, భూగర్భ డ్రైనేజీ నిర్మించాలని, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ శిథిలావస్థలో ఉందని తొలగించి నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. 100 శాతం వికలత్వం ఉండి దివ్యాంగుడైన జి మూగమన్యం కు పింఛన్ రావడంలేదన్నారు. అతడికి పింఛన్ మంజూరు చేయించాలని కోరారు. సీసీరోడ్లు, కరెంట్ జీరో బిల్లు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ డబ్బులు రావడం లేదని ప్రజలకు సీపీఎం నాయకులు వివరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, గాంధీనగర్ శాఖ కార్యదర్శి గంధం మదన్, బాలస్వామి, రత్నయ్య, బాలరాజు, మన్యం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న వేముల శ్రీనివాస్‌రెడ్డి

కొత్తకోట: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పాలనలో గ్రామాల అభివృద్ధి పడకేసిందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నారని కొనియాడారు. బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాల్లో కనీస వసతులు కల్పించలేదని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ఆర్థికంగా దివాళా తీసే స్థితికి తెచ్చారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన పనులు ప్రజలకు గుర్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీచుపల్లి, మేస్త్రీ శ్రీనివాసులు, బోయేజ్, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, సలీం ఖాన్, జేసీబీ రాములు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలిన భవన నిర్మాణ కార్మికులు



అమరచింత: మహబూబ్‌నగర్‌లో మంగళవారం నిర్వహించే తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభల్లో పాల్గొనేందుకు అమరచింత మండలం నుంచి భవన నిర్మాణ రంగ కార్మికులు తరలివెళ్లారు. మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర మహాసభలు జరుగుతున్న సందర్భంగా ప్రత్యేక వాహనంలో కార్మికులు తరలివెళ్లినట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాజు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, ప్రేమరత్నం, సామేలు, మస్లమని, కుర్మన్న, జిలాని తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం

గోపాల్‌పేట: జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు బోడ్డోళ్ల ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయంలో ప్రెస్‌క్లబ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోడ్డోళ్ల ప్రవీణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా నిరంజన్, ఉపాధ్యక్షుడిగా మంగదొడ్డి కృష్ణయాదవ్, ప్రధాన కార్యదర్శిగా మూలింటి శ్రీనివాసులు నాయుడు, సహాయ కార్యదర్శిగా మోడాల అనిల్, కోశాధికారిగా ఎర్రమోని అంజయ్యను నియమించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బాల్‌రాం, రాధాకృష్ణారెడ్డి, వంశీ, ప్రేమ్‌కుమార్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైట్ వాచ్‌మేన్ కోసం దరఖాస్తుల స్వీకరణ

ఖిల్లాఘనపురం: మండలంలోని దొంతికుంటతండా స్టేజీ వద్ద ఉన్న తెలంగాణ మోడల్ పాఠశాలలో పనిచేసేందుకు నైట్ వాచ్‌మెన్ జాబ్‌కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేక అధికారి పి.ఉమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కనీస అర్హత చదవడం, రాయడం వచ్చి ఉండి 50 ఏళ్ల లోపు వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేనివారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్నవారు దరఖాస్తులను నేరుగా పాఠశాలకు వచ్చి ఇవ్వాలని కోరారు.

బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

ఆత్మకూర్: యువత ఆన్‌లైన్ గేమ్‌లు, ఐపీఎల్ బెట్టింగులకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నరేందర్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో గేమ్‌లు, క్రికెట్ బెట్టింగులకు పాల్పడడం చట్టవిరుద్ధమన్నారు. యువత కొంతమంది స్వార్థపరుల వలలో పడుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

'వంట గ్యాస్ వినియోగదారులపై అదనపు భారం'



డీఎస్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వనపర్తి రూరల్: పట్టణంలోని వెంకటేశ్వర, గాయత్రి, బాలాజీ గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్స్ గ్యాస్ డెలివరీ సమయంలో వినియోగదారుల నుంచి సిలిండర్‌కు అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో డీఎస్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి మాట్లాడుతూ పట్టణంలో ఈ మూడు ఏజెన్సీలకు 50 వేల కనెక్షన్లు ఉన్నాయని, ఏజెన్సీ వారు బాయ్‌కి రూ.5 నుంచి రూ.8 వరకు ఇస్తున్నారు. బాయ్స్ సిలిండర్ డెలివరీ సమయంలో వినియోగదారులతో రూ.50 నుంచి రూ.60 అదనంగా తీసుకుంటున్నారని వివరించారు. ఏజెన్సీ లెక్క ప్రకారం గ్యాస్ రేటు ఎంత ఉంటే అంతే వసూలు చేసి ఐదు కిలోమీటర్ల వరకు ప్రజలకు ఉచితంగా డెలివరీ చేయాల్సి ఉన్నా.. ప్రజల వద్ద అక్రమంగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఫిర్యాదు చేసిన ఏజెన్సీ వారిలో మార్పు రానందున డీఎస్‌ఓకు విన్నవించామన్నారు. డీఎస్‌ఓ స్పందించి డెలివరీ బాయ్స్‌కు, ప్రజలకు న్యాయం చేయాలని, లేని పక్షంలో వినియోగదారులతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, పరమేశ్వరాచారి, గంధం గట్టయ్య, బాలస్వామి, ఎల్ బీసన్న తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ఐ కాల్వలో చనిపోయిన కోళ్లు



రేవల్లి శివారులో కాల్వ నుంచి చనిపోయిన కోళ్లను బయటికి తీస్తున్న పొక్లెయిన్

గోపాల్‌పేట: చనిపోయిన కోళ్లను ఎక్కడపడితే అక్కడ పడేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రేవల్లి తహసీల్దార్ లక్ష్మీదేవి అన్నారు. చనిపోయిన దాదాపు 300 కోళ్లు రేవల్లి సమీపంలోని కేఎల్ఐ కాల్వలో పడేశారని సమాచారం అందుకున్న తహసీల్దార్ మంగళవారం కాల్వ వద్దకు చేరుకుని కోళ్లను పొక్లెయినర్ సహాయంతో బయటకు తీయించారు. వెటర్నరీ డాక్టర్ వెంకటేష్‌ను పిలిపించి పరీక్షల కోసం శాంపిల్స్ సేకరించారు. కోళ్లు అత్యధిక వేడివల్లనే మరణించి ఉండొచ్చని ప్రాథమిక అంచనా వేశారు. వారంరోజుల క్రితం కూడా నాగపూర్ సమీపంలో ఇలాగే చేశారని ఇకపై ఇలాంటి పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాటుకోళ్ల మృత్యువాత

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో మంగళవారం అకస్మాత్తుగా నాటుకోళ్లు మృత్యువాత పడడంతో యజమాని ఆందోళన చెందుతున్నాడు. యజమాని కల్మూరి వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే కోళ్లు సోమవారం రాత్రి చెట్టు ఎక్కి కూర్చున్నాయని, మంగళవారం ఉదయం కోళ్లలో ఒక్కొక్కటిగా చెట్టుపై నుంచి పడి ఏడు కోళ్లు చనిపోయినట్లు ఆయన పేర్కొన్నారు. చెట్టుపైన ఉన్న కోళ్లు ఏమైనా విష సర్పాల కాటుకు గురై చనిపోయాయనే అనుమానంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. ఏమైన వ్యాధితో చనిపోయాయా అని మండల పశువైద్యాధికారి డా.సురేష్‌ను వివరణ కోరగా.. వాటికి శవ పరీక్ష చేస్తే అసలు విషయం తెలుస్తుందన్నారు.

హామీలు నెరవేర్చే వరకు ఉద్యమిస్తాం



వీపనగండ్లలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా కార్యకర్తలు

సాక్షి, నెట్‌వర్క్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఆశాకార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. ఆశాలకు రూ.18వేల కనీస వేతనం అమలు చేయాలని కోరారు. హక్కులు నెరవేర్చాలని పోరాటం చేస్తున్న ఆశాలను పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందించారు.

- కొత్తకోట చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆశాకార్యకర్తలు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి భాగ్య, మంజుల, పుష్ప, సంతోష, అర్చన, స్వాతి, రజిత, చంద్రకళ, వరలక్ష్మి, రాణి, భాగ్య, వెంకటేశ్వరమ్మ, శ్వేత, మహేశ్వరి పాల్గొన్నారు.
- పాన్‌గల్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ (సీఐటీయూ అనుబంధం) నాయకురాలు రేణుక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
- వీపనగండ్లలోని మహనీయుల విగ్రహాల వద్ద ఆశావర్కర్లు నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు సాయిలీల, ఆశన్న, ఆశావర్కర్ జిల్లా యూనియన్ అధ్యక్షురాలు సుజాత, ఆశాలు రాణి, పార్వతమ్మ, సునీత, వెంకటమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- మదనాపురం మండల కేంద్రంలో ఆశాలు ర్యాలీ నిర్వహించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బొబ్బిలి నిక్సన్, అనసూయ, భాగ్యలక్ష్మి, గంగ, సుహాసిని, యశోద, శారద, సుజాత, సలీమా బేగం, మౌలాన్‌బీ, నాగలక్ష్మి, మాధవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.
- ఆత్మకూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆశాలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎస్ శంకర్, ఆశాలు పుష్పలత, నర్సమ్మ, పుష్పబాయి, లావణ్య, ఆకాంక్ష, ఆశాలు పాల్గొన్నారు.
- ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆశాకార్యకర్తలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షురాలు ఇందిర, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.
- గోపాల్‌పేట బస్టాండు సమీపంలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలకు ఆశాకార్యకర్తలు వినతిపత్రం అందించారు.



ఖిల్లాఘనపురంలో..



మదనాపురంలో..



పాన్‌గల్‌లో..

పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

ఖిల్లాఘనపురం: తల్లి గారి ఇంటికి వెళ్తున్నానని చెప్పి తన పిల్లలతో కలిసి వెళ్లిన ఓ మహిళ కనిపించకుండా పోయిన ఘటన ఖిల్లాఘనపురం మండలం ఉప్పరిపల్లిలో చోటు చేసుకుంది. ఘటన సోమవారం చోటుచేసుకోగా మంగళవారం మహిళ భర్త కావలి అంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి వివరాల ప్రకారం.. ఉప్పరిపల్లికి చెందిన కావలి అంజనేయులు తో షాద్‌నగర్‌కు చెందిన గాజులపేట స్వాతికి 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కౌశిక్, జ్ఞానేశ్వరి ఇద్దరు సంతానం ఉన్నారు. మార్చి 24న ఉదయం 9 గంటల సమయంలో స్వాతి తన పిల్లలతో కలిసి తల్లి గారి ఊరికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. అదే రోజు సాయంత్రం ఆమె తండ్రి రాజుకు, భర్త ఆంజనేయులు ఫోన్ చేశాడు. స్వాతి అక్కడికి రాలేదనే సమాచారం తెలుసుకున్న అంజనేయులు చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లకు ఫోన్ చేసినా ఆచూకీ దొరకలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు.

108 వాహనంలో ప్రసవం



ఖిల్లాఘనపురం: ప్రసవం కోసం 108లో వనపర్తికి తీసుకెళ్తున్న ఓ నిండు గర్భిణీ మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే ప్రసవించిన ఘటన ఖిల్లాఘనపురంలో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని ఆగారం గ్రామానికి చెందిన గర్భిణీ నందిని మంగళవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ సిబ్బంది పరిశీలించి వనపర్తి ఆస్పత్రికి రెఫర్ చేశారు. వనపర్తికి తరలించేందుకు కుటుంబ సభ్యులు 108కు కాల్ చేయగా.. కొత్తకోట వచ్చిన అంబులెన్స్‌లో వనపర్తి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. 108 సిబ్బంది ఆమెకు వాహనంలోనే కాన్పు చేయగా.. నందిని పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డను వనపర్తి ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బంది రాము, చంద్రశేఖర్ తదితరులను నందిని కుటుంబ సభ్యులు, ఆస్పత్రి వైద్యులు అభినందించారు.